క్లుప్తంగా

విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

లింగాల: విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి నడవడికతో మెలగాలన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా విద్యార్థులకు సంబంధించి డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచినట్లే పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని వివరించారు. గురుకుల పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు నారాయణగౌడు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, పూజారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

ఉప్పునుంతల: స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నరేందరావు, మండల నాయకులు రమేష్ కోరారు. గురువారం మండలంలోని మామిళ్లపల్లి, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో బూత్ కమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నారు. మామిళ్లపల్లిలో భాస్కర్, సాయిబాబుయాదవ్, ఉప్పర్‌పల్లిలో శేఖర్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని , కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, మహేష్ తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ మాత్రమేనని ఆ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలో యూటీఎఫ్ మహాసభలు నిర్వహించారు. ఈ సభలలో కల్వకుర్తి మండల అధ్యక్షుడిగా నెహ్రూప్రసాద్, కార్యదర్శిగా రాజ, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, ప్రసన్న, కోశాధికారిగా సత్యనారాయణగౌడ్‌లతోపాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. పరిశీలకునిగా చిన్నయ్య వ్యవహరించారు. జిల్లా కోశాధికారి బాలరాజు, కార్యదర్శి రామేశ్వరయ్య, జిల్లా ఆడిట్ సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం చెప్పొద్దు

వెల్దండ: వ్యక్తిగత వివరాలు ఎవరికి చెప్పొద్దని ఎస్ఐ కురుమూర్తి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ పాఠశాలల్లో గురువారం సైబర్‌నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తులకు ఆధార్, బ్యాంక్‌ఖాతా, ఓటీపీ నంబర్లు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆటో, స్కూటీ ఢీ: ఒకరికి గాయాలు

వెల్దండ: ఆటో, స్కూటీ ఢీ కొని ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. హైదరాబాదు నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న కల్వకుర్తికి చెందిన డి. శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు.

పాడిపరిశ్రమపై అవగాహన పెంచుకోవాలి

తిమ్మాజిపేట: పాడి పరిశ్రమపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణి అన్నారు. మండలంలోని మారేపల్లిలోని రైతు వేదికలో గురువారం ఉపాధి కూలీలకు, రైతులకు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ మమబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాడి పరిశ్రమ నిర్వహించే వారికి స్టేట్ బ్యాంకు అందే సేవలను బ్యాంకు అధికారులు వివరించారు. ఏఈఓ సాయిరాం, బ్యాంక్ ఫ్యాకల్టీ శ్రీచరణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘సమగ్ర’ ఉద్యోగుల సమ్మె

కందనూలు: సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె గురువారం నాటికి పదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళా ఉద్యోగులు బోనాలతో అంబేద్కర్ కూడలిలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంఘం మురళి, కొత్త శ్రీధర్‌రావు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



జూపల్లిలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చారకొండ: పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని జూపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల ఇళ్లను ఆయన పరిశీలించారు. సర్వే అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారని, సర్వే నమోదులో సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తుదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఇళ్ల కోసం 7284 దరఖాస్తులు వచ్చాయని ఇప్పటివరకు 2500 దరఖాస్తులు పూర్తి అయినట్లు ఎంపీడీఓ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, నాయకులు రాములు యాదవ్, అంకిల్ల రామస్వామి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వంగూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను హెచ్చరించారు. గురువారం మండలంలోని జాజాల ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ విజయభాస్కర్ ఉన్నారు.

కాజ్‌వే పరిశీలన

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట, రామగిరి గ్రామాల మధ్యలో దుందుభీనదిపై ఉన్న కాజువేను గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. అనంతరం రఘుపతిపేటలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, అధికారులు ఉన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో వెనకాల నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, ఉమ్మడి నాయకులు కాళ్ల నిరంజన్‌లు అన్నారు. సందర్భంగా గురువారం పట్టణంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ఇప్పటికే 400 డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించారని వాటర్, కరెంట్ సదుపాయం లేకపోవడంతో అప్పటి ప్రభుత్వం వాటిని పంపిణీ చేయలేదని తెలిపారు. అర్హులకు వెంటను డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవిందర్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, తిరుపతయ్య, కొత్త శ్రీనివాసులు, మధు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే





తెలకపల్లి మండలం గౌరారంలో...,మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీలో సర్వే చేస్తున్న సిబ్బంది

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను గురువారం కల్వకుర్తి ఎంపీడీఓ వెంకటరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్నవారి ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఎంపీడీఓ వెంకటరాములు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిజాముద్దీన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండలంలో గౌరారంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి వాటిలో ఉన్న వివరాలను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాయకులు బిక్కుసాయిబు, కురుమూర్తి, మల్లయ్య, శ్రీనివాసులు, శోభన్, ఆంజనేయులు, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొంటున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు నల్లమల విద్యార్థులు



విద్యార్థులను సన్మానిస్తున్న స్కూల్ డైరెక్టర్ సీఎం రెడ్డి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎంఎస్ఎన్ ఎక్సలెంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు సీఎం కప్ అండర్–14 విభాగం ఖోఖోలో కృష్ణనాయక్, రామునాయక్, శివరామకృష్ణ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అలాగే అథ్లెటిక్స్ ట్రాత్‌లైన్, కిడ్స్ జావెలింగ్‌త్రోలో కృష్ణనాయక్ గోల్డ్‌మెడల్, హరికృష్ణ సిల్వర్, సంపత్ కాంస్య పతకం సాధించారు. అథ్లెటిక్స్ అండర్–20 విభాగంలో సైదానాయక్ (100 మీటర్ల) జిల్లా స్థాయి రెండో స్థానంలో నిలిచారు. షూటింగ్ బాల్‌లో సైదానాయక్ సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. గురువారం పాఠశాల ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, స్కూల్ డైరెక్టర్ సీఎం రెడ్డి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, మన్సూర్, పీఈటీలు రాజేందర్, సైదులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలు ప్రతిభ కనబర్చారు. షాట్‌పుట్ పోటీల్లో దశరథం ప్రథమ స్థానం, అశోక్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు గురువారం ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆర్య వైశ్య మహాసభకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కల్మిచర్ల రమేష్, మార్కెట్ డైరెక్టర్ శివాలయం శ్రీనివాస్, జిల్లా కోశాధికారి జగదీశ్వర్, అధనపు కార్యదర్శి శ్రీధర్, పీఆర్‌టీ మిర్యాల రాజయ్య, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, కల్వ రమేష్, సురేష్, ఆంజనేయులు, వాసవీక్లబ్ ఆవోపా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి



వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న అశోక్

కొల్లాపూర్: ఎలాంటి షరతులు లేకుండా సన్నవడ్లతో పాటు, దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన పట్టణంలోని మార్కెట్‌యార్డులో రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చిన వరిధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. యార్డులో కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. దొడ్డు వడ్లకు కూడా క్వింటాలుకు రూ.500 వందల బోనస్ చెల్లించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 10 కిలోల వడ్లు తరుగు తీస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టాలన్నారు. ఆయన వెంట నాయకులు రాజు, మద్దిలేటి, శ్రీనివాసులు, కౌసల్య తదితరులున్నారు.

ఎంఈఓలకు సన్మానం

కొల్లాపూర్: పట్టణంలో ప్రస్తుతం ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఇమ్మానుయేల్‌ను, గతంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన చంద్రుడును కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల ప్రభుత్వ ఉపాధ్యాయులు సన్మానించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓలు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో శోభారాణి, కురుమయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, కుర్బాన్‌అలీ, ఆర్.కృష్ణ, నారాయణ, శంకర్‌నాయక్, ఈశ్వరయ్య, నరేందర్‌రెడ్డి, వెంకటరమణ, చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఏబీవీపీ మండల నాయకుడు వెంకటేష్ కోరారు. గురువారం పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంట ఏజెన్సీ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేకల శివ, గంటుపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

వారణాసి భూములపై రాష్ట్రపతికి లేఖ

పెద్దకొత్తపల్లి: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి రాజుకాటు వద్ద ఉన్న సర్వ సేవా సంఘం 13 ఎకరాల భూమిని ధ్వంసం, భవనాల కూల్చివేతపై జాతీయ సర్వోదయ నాయకులు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్, ఉపాధ్యక్షుడు రాముయాదవ్‌లు గురువారం లేఖ ద్వారా రాష్ట్రపతికి ఫిర్యాదు పంపించారు. 13 ఎకరాల భూమిని ఉత్తర రైల్వే శాఖ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వినోబాబా కుటీర భూములను, గాంధీ భూముల భవనాలను కూల్చి ప్రభుత్వం ఆక్రమించుకుందని లేఖలో పేర్కొన్నారు. ఈ భూములను సర్వోదయ నాయకులకే అప్పగించాలని కోరారు. ఈశ్వర్, నిరంజన్, శివ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎం

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాత పరీక్ష రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియోద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ ఏఎన్ఎంలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల మంది ఏఎన్ఎంలు కాంట్రాక్ట్ పద్ధతిన 20 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించారు. తక్షణం సీనియార్టీ ఆధారంగా వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. రూ. 27 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఆర్ శ్రీనివాసులు, బాలస్వామి, శివరాములు, సుగుణ, అరుణ, శివాని, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు

దోమలపెంట: ఈగలపెంటలోని డీఏవీ ఆంగ్ల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎస్టీ విద్యార్థులకు గురువారం సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ జ్యోతి మాట్లాడుతూ సికిల్ సెల్ అంటువ్యాధి కాదని వంశపారపర్యంగా సంక్రమిస్తుందన్నారు. ముందుగానే గుర్తిస్తే ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. మొత్తం 20 మందికి పరీక్షలు నిర్వహించారు. ఎవరికి వ్యాధి లక్షణాలు లేవని వైద్యులు తెలిపారు. దోమలపెంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కల్పించారు. ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

చారకొండ: పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మండల పశువైద్య అధికారి శివకుమార్ అన్నారు. మండలంలోని గోకారంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ సంబంధిత, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశుసంపదపై రైతులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మధర్, గోపాల మిత్ర వెంకటేశ్వర్లు, శివరాం, లక్ష్మయ్య, మల్లయ్య, సాయిబాబు, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



అచ్చంపేట రూరల్: మండలంలోని రంగాపూర్, పులిజాల గ్రామాల్లో కోదండ రామస్వామి దేవాలయాల నిర్మాణం కోసం గురువారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి భూమి పూజ చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 51 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతోనే దేవాలయాల నిర్మాణం జరుగుతోందని జీయర్‌స్వామి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

ఉప్పునుంతల: ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ప్రీయూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు గురువారం మండల కేంద్రంలో ఆయిల్‌పాం పంటసాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. మొక్కల ఎంపిక, యాజమాన్య పద్ధతులతో పాటు మార్కెటింగ్ విషయాలపై రైతులకు వివరించారు. ఆయిల్‌పాం సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు అనంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, జంగిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నారయ్యయాదవ్, తదితరులు, కంపెనీ ప్రతినిధులు రాకేష్, ఫనికుమార్, ఆరిఫ్‌లు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన ఆర్ల వెంకటమ్మకు రూ.24వేలు, తోట లక్ష్మీకి రూ.14వేలు, పెద్ద యాదమ్మలకు రూ.12వేల చొప్పున సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గురువారం మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి లబ్ధిదారులకు చెక్కు అందజేశారు. సుదర్శన్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా మహా పడిపూజ

అచ్చంపేట రూరల్: మండలంలోని బొమ్మన్‌పల్లిలో గురువారం అయ్యప్ప మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, అయ్యప్ప మాలధారులు పదునెట్టాంబడి పూజ, అభిషేకాలు చేశారు. అనంతరం మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

మొక్కల సంక్షరణ అందరి బాధ్యత

తెలకపల్లి: మొక్కల సంక్షరణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని గౌతంపల్లి, గడ్డంపల్లి, పెద్దూరు గ్రామాలలోని నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామా ల పంచాయతీ కార్యదర్శులకు, నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చా రు. ఆయన వెంట ఎంపిఓ వెంకటయ్య, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు చోరీ




పెంట్లవెల్లి: తాళం వేసిన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు 500 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బర్ల ఏకాంబరెడ్డి వారం రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఏకాంబరం ఇంటి తాళాలను పగల గొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఇంటి తలుపులు తెరచిఉండటంతో స్థానికులు ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. బాధితుడు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్ టీంతో, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

స్థల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కృష్ణానది తీర ప్రాంతమైన అమరగిరి గ్రామ సమీపంలో టూరిజం ఏర్పాటు కోసం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజం శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఫారెస్టులో స్థల పరిశీలన చేసినట్లే పేర్కొన్నారు. అనంతరం ఇంజన్ బోటులో నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాసులు,, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ పాఠశాలగా జెడ్పీహెచ్ఎస్



తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపిక అయినట్లు ఎంఈఓ సత్యనారాయణ శెట్టి గురువారం ఒక్రపకటనలో తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో పాఠశాల హెచ్ఎం ఉత్తమ పాఠశాల అవార్డు అందుకోనున్నారని తెలిపారు.

ముందస్తు అరెస్టు



పెంట్లవెల్లి: వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చలో అసెంబ్లీ పిలుపుమేరకు గురువారం హైదరాబాద్ తరలివెళ్లేందుకు సిద్ధం అవుతుండగా పోలీసులు మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎర్ర శ్రీను మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేసిన మా పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో మూలె కుమార్, మిద్దె రవి, మోహన్, రామకృష్ణ, కేశవులు, విష్ణు, కృష్ణలు పాల్గొన్నారు.

తాడూరు: చలో అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా గురువారం మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. దళితులను విచిన్నం చేసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర పన్నాయని రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి ఆరోపించారు. అరెస్టు అయిన వారిలో మాల మహానాడు నాయకులు ఎం పర్వతాలు, కురుమూర్తి, పి పర్వతాలు, లక్ష్మణ్, కాశీ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.


చెంచులకు దుప్పట్ల పంపిణీ

లింగాల: మండలంలోని నల్లమల ప్రాంతంలో ఉన్న ఎర్రపెంట చెంచులకు రగ్గులను గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు రంగినేని శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ప్రభుత్వంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, గిరిజన ఉద్యోగ నియోజకవర్గం అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, నాయకులు వెంకటయ్య, నారాయణగౌడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తార్, చెంచు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

తెలకపల్లి: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఆయన సందర్శించారు. మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలను నూతన చైర్మన్ రమణారావుకు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన



నాగర్‌కర్నూల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఖండిస్తూ ప్రజా సంఘాలు, పలు పార్టీల నాయకులు గురువారం నిరసన తెలిపారు. మన్ననూర్‌లో కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. బల్మూరులో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కల్వకుర్తి, అమ్రాబాద్ వివిధ సంఘాల నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కోడేరులో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పెంట్లవెల్లిలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. కొల్లాపూర్, తాడూరు, అచ్చంపేటలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్వకుర్తిలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎజాస్, శ్రీను, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్, నాగర్‌కర్నూల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, నాయకులు నర్సింహ, ఆంజనేయులు, ఈశ్వర్, బాలస్వామి, దశరథ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, రామయ్య, స్వేరోస్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ జె. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట / కల్వకుర్తి యం. విజయ్ - 99630 23777

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్ 9951602829
పి. మధుసూదన్ గౌడ్: 90100 06785